క్లుప్తంగా

27 నుంచి రామాలయ పునఃప్రతిష్టాపనోత్సవాలు

నరసాపురం: పట్టణంలో మెయిన్ రోడ్డులోని కుమ్మర వీధి రామాలయంగా పేరుగాంచిన కోదండ రామాలయం స్వామి వారి పునఃప్రతిష్టాపన మహోత్సవాలు ఈ నెల 27 నుంచి వచ్చే నెల 3 వరకూ ఘనంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆలయ కమిటీ ప్రతినిధులు చెప్పారు. 1910లో నిర్మించిన ఈ ఆలయాన్ని కొవ్వలి ఫౌండేషన్ ద్వారా రూ.కోటితో అభివృద్ధి చేసి విగ్రహ పునఃప్రతిష్ఠ చేస్తున్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ, ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు పాల్గొంటారని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

యలమంచిలి: నరసాపురం నుంచి యలమంచిలి, ఇలపకుర్రు విద్యుత్ సబ్ స్టేషన్స్ వచ్చే 33 కేవీ లైను మరమ్మతులు, ట్రీ కటింగ్ కారణంగా శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ నరసాపురం డివిజనల్ ఇంజినీర్ బి.సురేష్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. యలమంచిలి, మేడపాడు, పెనుమర్రు, నేరేడుమిల్లి, శిరగాలపల్లి, కట్టుపాలెం, ఇలపకుర్రు, దొడ్డిపట్ల, బూరుగుపల్లి, అబ్బిరాజుపాలెం, చించినాడ, కాజ, ఊటాడ గ్రామాలకు విద్యుత్ సరఫర ఉండదని ఆయన వివరించారు. విద్యుత్ సరఫరాలో కలుగుతున్న అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

ఏఎస్ఎన్ఎం కళాశాల డిగ్రీ సెమిస్టర్ ఫలితాల విడుదల

పాలకొల్లు సెంట్రల్: స్థానిక అద్దేపల్లి సత్యనారాయణమూర్తి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిబ్రవరిలో నిర్వహించిన ఫస్ట్ సెమిస్టర్, థర్డ్ సెమిస్టర్ పరీక్షల ఫలితాలు విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.రాజరాజేశ్వరి తెలిపారు. సెమిస్టర్ ఫలితాలను డాక్టర్ ఎస్వీ రంగారావు చేతుల మీదుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ టి.కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రహణమొర్రి వ్యాధిగ్రస్తులకు ఉచిత శస్త్రచికిత్సలు

యలమంచిలి: గ్రహణ మొర్రి (పెదవి చిలుక, అంగిలి చిలుక)తో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులకు బసవతారకం స్మైల్ ట్రయిన్ సెంటర్, బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి సంయుక్తంగా ఉచితంగా శస్త్రచికిత్సలు చేయనున్నట్లు సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పి.శ్యామ్‌సుందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శస్త్రచికిత్సకు అర్హులను గుర్తించడానికి మార్చి 1న భీమవరం అగ్రికల్చరల్ మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న ఏఆర్‌కేఆర్ మున్సిపల్ హైస్కూల్లో శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. ఆరు నెలల నుండి 50 ఏళ్లలోపు వయస్సు ఉన్న వారంతా ఈ శిబిరానికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని ఆయన కోరారు.

ఎవరెస్టు పర్వతారోహణకు ప్రత్యేక శిక్షణ

పాలకొల్లు అర్బన్: మండలంలోని లంకలకోడేరు గ్రామానికి చెందిన గోగులమండ దాసు ఎవరెస్టు పర్వతారోహణకు ప్రత్యేక శిక్షణ పొందుతున్నారు. దీనిలో భాగంగా గత 5 రోజులు జమ్ముకాశ్మీర్‌లోని దట్టమైన మంచు పర్వతారోహణ పూర్తి చేసి స్వగ్రామానికి గురువారం చేరుకున్నట్లు దాసు విలేకరులకు తెలిపారు. శరీరాన్ని 10 డిగ్రీల సెంటీగ్రేడులో అలవాటు పడేందుకు శిక్షణ పొందారు. ఎవరెస్టు శిఖరం అధిరోహించడం కోసం 3,850 మీటర్లు ఎత్తు, 3,750 మీటర్లు ఎత్తులోని పర్వతాలను అధిరోహించినట్లు దాసు విలేకరులకు తెలిపారు. మొత్తం 37 కిలోమీటర్లు దట్టమైన మంచులో నడిచి లక్ష్యాలను చేరుకున్నామన్నారు. ఆచంట ఎమ్మెల్యే, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు పర్వతారోహణకు ఆర్థిక సహాయం అందజేశారని దాసు కృతజ్ఞతలు తెలిపారు.

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం

పెనుగొండ: మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలతో జీవితాలు నాశనం అవుతాయని తణుకు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆర్.సత్యవతి అన్నారు. గురువారం సిద్ధాంతంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు.

ఖతార్‌లో ఆగర్తిపాలెం వాసి గుండెపోటుతో మృతి

పాలకొల్లు అర్బన్: ఉపాధి కోసం ఖతార్ దేశం వెళ్లి అక్కడ గుండెపోటుతో పాలకొల్లు మండలం ఆగర్తిపాలెం గ్రామానికి చెందిన కొల్లాబత్తుల జాన్‌కెనడీ(47) మృతిచెందారు. జాన్ కెనడీ గత పది సంవత్సరాలుగా ఖతార్ దేశంలో ఉపాధి పొందుతున్నారు. రెండేళ్ల క్రితం ఇండియాకి వచ్చి తిరిగి వెంటనే ఖతార్ వెళ్లిపోయారు. ఈ నేపథ్యంలోభారత కాలమాన ప్రకారం గత శనివారం మృతి చెందారు. జాన్ కెనడీ మృతదేహానికి ఖతార్ దేశంలో శవపంచనామా నిర్వహించి స్వస్థలమైన ఆగర్తిపాలెం గ్రామానికి గురువారం చేరుకుంది. టీసీఎఫ్ చర్చి పాస్టర్ ఓగూరి బుల్లబ్బాయ్, వైఎస్సార్ సీపీ నాయకుడు దొండపాటి శశికిరణ్, టీసీఎఫ్ ఎంసీ మెంబర్ నల్లి నాగేశ్వరరావు, చింతా శ్రీను తదితరులు జాన్‌కెనడీ మృతదేహాన్ని ఇండియాకి రప్పించడంలో పూర్తి సహకారం అందించారు.

ప్రజాస్వామ్య విలువలకు పాతర

పాలకొల్లు అర్బన్: ప్రజాస్వామ్య విలువలకు ఈనాడు రామోజీరావు పాతరేశారని రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ మండిపడ్డారు. టీడీపీ నేత పట్టాభిని పోలీసులు కొట్టారంటూ పాత ఫొటోలతో వార్త ప్రచురణపై గురువారం వైఎస్సార్ సీపీ కార్యాలయం వద్ద ఈనాడు ప్రతులను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. తెలుగుదేశం నాయకులను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోందని ప్రజలను తప్పుదోవ పట్టించే వార్తలను ప్రచురిస్తున్న ఈనాడు పత్రిక ప్రజాస్వామ్య విలువలను కాలరాసిందని ఆనందప్రకాష్ మండిపడ్డారు. పేద, మధ్యతరగతి వర్గాలకు అనేక సంక్షేమ పథకాలను అందిస్తూ నీతి, నిజాయితీ పనిచేస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపైనా, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపైనా విషం చిమ్ముతూ అసత్య కథనాలను ప్రచురిస్తున్న ఈనాడు పేపర్‌ను రాష్ట్రంలోని వైఎస్సార్ సీపీ నాయకులు బహిష్కరించాలని పిలుపునిచ్చారు. చింతలపూడి పార్టీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి కరపత్రికగా ఈనాడు మారిందన్నారు. అసత్యవార్తలు రాస్తూ ఈనాడు పత్రిక ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎం.మైఖేల్‌రాజు, పట్టణ, మండల సచివాలయ కన్వీనర్లు ఎంఎస్ వాసు, పార్శి వెంకటరత్నం, ఖండవల్లి వాసు, ఆలయాల చైర్మన్‌లు కోరాడ శ్రీనివాసరావు, కావలి శ్రీనివాసరావు, గాదె వెంకన్న, నంబూరు శ్రీగంగా పవన్, మామిడి వెంకటేశ్వరరావు (బాబు), ఇజ్జాడ చినబాబు, శీలం సూరిబాబు, శంకరాపు శ్రీను, ఉప్పే పండుబాబు, పీటర్సన్ చిన్ని, మోర్త గిరీష్, తలుపూరి భుజంగరావు, కేశవరపు సత్యనారాయణ, షేక్ చాన్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమన్న నాయకులు

పెనుగొండ: అబద్ధపు రాతలు, అసత్య ప్రచారాలతో ప్రజలను మభ్యపెడుతున్నారంటూ నిరసన వ్యక్తం చేస్తూ వైఎస్సార్‌సీపీ నాయకులు ఆచంటలో ఈనాడు దినపత్రిక ప్రతులను దగ్ధం చేశారు. గురువారం సాయంత్రం పచ్చ మీడియాకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పెనుగొండ ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు పాలపర్తి సుబ్రహ్మణ్యం, తోలేటి శ్రీనులు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్, మండల ఉపాధ్యక్షుడు పులిదిండి వెంకటేశ్వరరావు, పార్టీ నాయకులు కోట వెంకటేశ్వరరావు, యాండ్ర శ్రీను, తవిటికి సత్యనారాయణలు పాల్గొన్నారు.



ఆచంటలో ఈనాడు ప్రతులను దగ్ధం చేస్తున్న నాయకులు

వాతావరణ మార్పులతో మామిడి రైతుల ఆందోళన

- కొన్నిచోట్ల నిలబడి మామిడి పూత
- మరికొన్ని చోట్ల మాడిపోయిన వైనం
- దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం

మొగల్తూరు: ఈ ఏడాది మామిడి రైతులు గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్నారు. వాతావరణంలో మార్పులు కారణంగా మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. మబ్బులు, మంచు, అకాల వర్షాలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. గతేడాది డిసెంబర్, ఈఏడాది జనవరి మొదటి వారంలో మామిడి పూత ఆశాజనకంగా ఉండటంతో రైతులు మందులు పిచికారీ చేశారు. అయితే మందులు పిచికారీ చేసిన అనంతరం మంచు విరివిగా కురియడంతో పూసిన పూత మాడిపోయింది. మరోసారి మందులు పిచికారీ చేయడంతో ఇప్పుడిప్పుడే పూత నిలబడే పరిస్థితి కనిపిస్తుంది. సరైన సమయంలో పూత పూయకపోతే దిగుబడిపై ప్రభావం ఉంటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు దిగుబడి లేకపోతే ఆర్థికంగా నష్టపోతామని ఆవేదన చెందుతున్నారు. సాధారణంగా ప్రతీ ఏడాది మార్చి నాటికి దిగుబడికి వచ్చే పరిస్థితి ఉండేదని, ఈ ఏడాది ఆ పరిస్థితి కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు.



పూత లేక వెలవెలబోతున్న మామిడి తోట



మొగల్తూరులో ఇటీవల పూత పూసి నిలబడిన మామిడితోట

నియోజకవర్గంలో 2500 ఎకరాల్లో మామిడితోటలు

నియోజకవర్గంలో సుమారు 2500 ఎకరాల్లో మామిడి తోటలు ఉన్నాయి. నరసాపురం మండలంలో రాజుగారితోట, సీతారాంపురం, వైఎస్‌పాలెం, ఎల్‌బిచర్ల, లక్ష్మణేశ్వరం, తూర్పుతాళ్ళు గ్రామాల్లో సుమారు 1500 ఎకరాలు, మొగల్తూరు మండలంలో మొగల్తూరు, రామన్నపాలెం, పేరుపాలెం, కేపీపాలెం గ్రామాల్లో సుమారు వెయ్యి ఎకరాల్లో మామిడితోటలు విస్తరించి ఉన్నాయి. కొబ్బరి తోటల్లోను అంతర పంటగానూ మామిడి చెట్లున్నాయి. అయితే మామిడి తోటలు లీజుకు తీసుకోవాలంటే తోటలోని చెట్లు, పూసిన పూత, కాయల రకాలను బట్టి లీజుంటుంది. సుమారు రూ.50 వేల నుండి రూ.లక్ష వరుకు లీజ్ చెల్లించాల్సి ఉంటుంది.

రకరకాల మామిడికి ప్రసిద్ధి

నరసాపురం నియోజకవర్గలో వివిధ రకాలైన మామిడి కాయలకు ప్రసిద్ధి. బంగినపల్లి, చెరుకురసం, కొత్తపల్లి కొబ్బరి, కలెక్టర్, ఇమామ్ పసందు, భూలోక సుందరి, సువర్ణరేఖ, నీలకంఠాలు, పంచదార కలసాలు ఇలా అనేక రకాలు కాయలకు ప్రసిద్ధి. అన్నిటికన్నా దేశవ్యాప్తంగా పేరున్న మొగల్తూరు బంగినపల్లి అంటే తెలియనివారుండరు. అన్ని రకాల కాయలు పంట పూర్తయిన తరువాత మే, జూన్ నెలలో బంగినపల్లి మామిడి మార్కెట్లోకి ప్రవేశిస్తుంది.

మందుల పిచికారీకి రూ.50 వేలు



నేను మామిడితోటను కౌలుకు తీసుకుని పూత నిలవడానికి ఇప్పటి వరుకు రూ.50 వేలు ఖర్చు చేశా. మంచు ఎక్కువగా కురవడంతో ముందు పూసిన పూత అంతా మాడిపోయింది దీంతో దిగుబడిపై ప్రభావం ఉంటుందని అనుకుంటున్నాను.

– మన్నే వెంకటేశ్వర్లు, కౌలు రైతు

ఇప్పుడిప్పుడే పూత నిలబడుతోంది



వాతావరణంలో మార్పులు కారణంగా పూత పూయక పోవడం, పూసినా రాలి పోవడం, లేదా మాడిపోయింది. ఇప్పటికే నాలుగు సార్లు మందులు పిచికారీ చేశా. పూత ఇప్పుడిప్పుడే నిలబడుతుంది. ఏమైనా ఈ ఏడాది మామిడి దిగుబడిపై ప్రభావం చూపించడమే కాక పంట ఆలస్యమయ్యే పరిస్థితి కనిపిస్తుంది. పూత నిలబడితేనే దిగుబడి బాగుంటుంది.

– అల్లు సర్వారావు, లక్ష్మణేశ్వరం, రైతు

బాధ్యతతో పదవులు నిర్వహించాలి

నరసాపురం: పదవులు పొందిన వారు పార్టీకోసం బాధ్యతగా పనిచేయాలని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా వైఎస్సార్‌సీపీ పంచాయతీరాజ్ వింగ్ అధ్యక్షుడుగా నియమితులైన మొగల్తూరుకు చెందిన తెన్నేటి గిరి, ఎస్సీసెల్ అధ్యక్షుడుగా నియమితులైన మాజీ ఏఎంసీ చైర్మన్ కొల్లాబత్తుల రవి, ఐటీ వింగ్ అధ్యక్షుడుగా నియమితులైన బుడితి సుమన్‌లు గురువారం ముదునూరిని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కూడా కృతజ్ఞతలు చెప్పారు. పార్టీ అప్పగించిన కీలక బాధ్యతను శక్తివంచన లేకుండా పూర్తి చేస్తామని చెప్పారు.

సంక్షేమపథకాలు ప్రజలకు వివరించాలి

పెనుగొండ: వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులు అందరూ ఆయా వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రచారం చేయాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. నూతనంగా నియమించిన వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు కుంచిలపల్లి విన్‌స్టన్ బాబు(పాలకొల్లు), చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు అందే నాగబసవన్న(ఆచంట)లు తూర్పుపాలెంలో గురువారం మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును మర్యాద పూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సత్కరించారు. మండల స్థాయి, గ్రామ స్థాయి నూతన కమిటీల నియామకం పూర్తి చేసి పార్టీ పటిష్టతకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పాలకొల్లుకు చెందిన మండల కన్వీనరు మైలాబత్తుల మైకెల్ రాజు, వైస్ ఎంపీపీ పడవల సునీల్‌బాబు, ఎంపీటీసీ కర్రి జోగయ, సర్పంచ్‌లు రాపాక కరుణాకర్, సాకా కమలాకర్, ఎస్సీ సెల్ కన్వీనరు పి వెంకటరత్నం, ఎంపీటీసీలు అన్నవరపు వెంకట రమణ, పానుమట్ల వీరాస్వామి, పిల్లి శ్యామ్, కోటా రత్నరాజు, తండ ఇసాక్ రాజు, అడిదల సుధాకర్ పాల్గొన్నారు.



తూర్పుపాలెంలో మాజీ మంత్రి శ్రీరంగనాథరాజును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందిస్తున్న యువజన విభాగ నూతన అధ్యక్షుడు బాబు



ప్రభుత్వ ఛీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజును కలిసి కృతజ్ఞతలు చెబుతున్న తెన్నేటి గిరి, కొల్లాబత్తుల రవి



పాలకొల్లులో అనుబంధ విభాగాల అధ్యక్షులను అభినందిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పాలకొల్లులో..

పాలకొల్లు అర్బన్: వైఎస్సార్ సీపీ బలోపేతానికి, అలాగే రానున్న ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పార్టీ పదవులు స్వీకరించిన వారు కృషి చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి కవురు శ్రీనివాస్ అన్నారు. న్యాయవాదిగా పనిచేస్తున్న కుంచిలపల్లి వినిస్టన్‌బాబును వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడుగాను, అలాగే బలభద్రుని బాల రెడ్డియ్యను వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడుగాను, నాట్యాచార్యుడు పోకల వెంకటేశ్వరరావును సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడిగాను నియమించిన సందర్భంగా పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం శ్రీనివాస్ వీరికి పుష్పగుచ్చాలు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. అలాగే రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, చింతలపూడి పార్టీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు తదితరులు పార్టీ పదవులు పొందిన వీరిని ప్రత్యేకంగా అభినందించారు.

దేశానికే ఆదర్శంగా సీఎం జగన్ పాలన

పెనుగొండ: రాష్ట్రంలో దేశంలో ఎక్కడాలేని విధంగా సంక్షేమాన్ని, అభివృద్ధిని చేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శంగా నిలుస్తున్నా పచ్చమీడియా, చంద్రబాబు ప్రజలను మభ్యపెట్టడానికి ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. గురువారం పెనుగొండ, ఆచంట మండలాల్లోని దొడ్డివారి పాలెం, మానేవారి పాలెం, వంగతాళ్ల చెరువుల్లో గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహించి ప్రజలకు అందిన సంక్షేమాన్ని వివరించారు. రాష్ట్రంలో అందిస్తున్న సంక్షేమ పథకాలు దేశంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయన్నారు. సీఎం జగన్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ఇతర సీఎంలు అనుసరిస్తున్నారన్నారు. సంక్షేమానికి, అభివృద్ధికి లక్షల కోట్లు వ్యయం చేశారన్నారు. దీంతో ఉనికిని కోల్పోతామన్న భయంతో ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. నిన్న మొన్నటి వరకూ సీఎం జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విమర్శించిన చంద్రబాబు నేడు మాట మార్చి సీఎం జగన్ సంక్షేమ పథకాలను తప్పని సరిగా అమలు చేస్తానని సీఎం జగన్ బాటలోకి వచ్చారన్నారు. మరింత సంక్షేమం కోసం సీఎం జగన్‌కు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో ఆచంట ఏఎంసీ చైర్మన్ చిల్లే లావణ్య, పెనుగొండ ఎంపీపీ పూతినీడి వెంకటేశ్వరరావు(పెద్ద), వైస్ ఎంపీపీ పాలపర్తి సుబ్రహ్మణ్యం, ఆచంట, దేవ సర్పంచ్‌లు కోట సరోజినీ వెంకటేశ్వరరావు, నల్లూరి సత్యనారాయణ, రాష్ట్ర కార్యదర్శి వైట్ల కిషోర్‌కుమార్, పార్టీ నాయకులు కేశరపల్లి రమేష్, కోట వెంకటేశ్వరరావు, ఎన్ విజయ్‌బాబు, యాండ్ర శ్రీను, తవిటికి సత్యనారాయణ, ఏఎంసీ డైరక్టర్లు సాకా సుబ్రహ్మణ్యం, కుసుమే రాంబాబు, పోడూరి రామయ్య, కొవ్వూరి వేణుమాధవ రెడ్డి, పెచ్చెట్టి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



దొడ్డివారి పాలెంలో గడపగడపకూ మన ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు

సీఎం జగన్ పాలనలో మాదిగలకు గుర్తింపు

నరసాపురం: మాదిగల ఆత్మ గౌరవాన్ని గుర్తించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని మాదిగ రిజర్వేషన్ పోరాట సంఘర్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెన్నేటి సురేష్ మాదిగ అన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 7 దశాబ్దాలు దాటుతున్నా ఇప్పటి వరకూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి చట్టసభల్లో మాదిగలకు ప్రాతినిధ్యమే లేదన్నారు. రిజర్వుడ్ అన్ని స్థానాల్లో మాలలకే రాజకీయ పార్టీలు అవకాశం ఇచ్చేవని చెప్పారు. మొట్టమొదటి సారిగా తూర్పు గోదావరి జిల్లాలో సీనియర్ ఎమ్మార్పీఎస్ నాయకుడు బొమ్మి ఇజ్రాయిల్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ప్రకటించి ముఖ్యమంత్రి మాదిగల కలను నిజం చేశారన్నారు. ఇప్పటి వరకూ తూర్పుగోదావరి జిల్లాలో ఏ సందర్భంలోను కూడా మాదిగలను చట్ట సభలకు పంపించే ప్రయత్నం రాజకీయపార్టీలు చేయలేదన్నారు. దీంతో మాదిగలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఇప్పుడు జగన్ మాదిగల ఆకాంక్షను గుర్తించి న్యాయం చేశారని చెప్పారు.



తెన్నేటి సురేష్

క్షీరారామలింగేశ్వరుని సేవలో అల్లూరి జిల్లా సబ్ కలెక్టర్

పాలకొల్లు సెంట్రల్: పంచారామ క్షేత్రం శ్రీక్షీరారామలింగేశ్వరస్వామిని అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు రెవెన్యూ డివిజన్ సబ్ కలెక్టర్ వి.అభిషేక్ గురు వారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన సబ్ కలెక్టర్ అభిషేక్‌కు అధికారులు ముందుగా ఆలయమర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం గణపతి పూజ, క్షీరారామలింగేశ్వర స్వామి, జనార్థనస్వామి, లక్ష్మీపార్వతి అమ్మవార్లు, గోవుకు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ఆలయ మండపంలో వేద ఆశీర్వచనం చేశారు. ఆలయ ట్రస్టీబోర్డు చైర్మన్ కోరాడ శ్రీనివాసు సబ్ కలెక్టర్‌ను స్వామివారి శేషవస్త్రంతో సత్కరించి స్వామి చిత్రపటాన్ని అందజేశారు. ఆలయ సిబ్బంది గాంధీ, నాయుడు, అర్చకులు అనిల్, రెవెన్యూ ఆర్ఐ త్రిమూర్తులు పాల్గొన్నారు.



సబ్ కలెక్టర్ అభిషేక్‌కు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న ఆలయ చైర్మన్ శ్రీనివాసు

సదాశివమూర్తికి సత్కారం

పాలకొల్లు సెంట్రల్: గత 24 ఏళ్లగా చైతన్య కృత్రిమ అవయవ కేంద్రం ద్వారా సేవలందిస్తున్న సదాశివమూర్తి ఆస్ట్రేలియా యూనివర్శిటీ ప్రైడ్ ఆఫ్ ఇండియా అవార్డును అందుకోవడం చాలా అభినందనీయమని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ యడ్ల తాతాజీ తెలిపారు. గురువారం స్థానిక 3వ వార్డు శ్రీరాంపేటలో ఉన్న చైతన్య కృత్రిమ అవయవ కేంద్రం వద్ద సదాశివమూర్తిని ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో వైఎస్సార్ పార్టీ నాయకులు మోర్త గిరీష్, జోగాడ ఉమామహేశ్వరరావు, బెజ్జవరపు నాగరాజు, తలుపూరి భుజంగరావు, చెన్ను విజయ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు బీరువా అందజేత

మొగల్తూరు: స్థానిక పెన్మత్స రంగరాజు ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసించిన 2012–13 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు గురువారం పాఠశాలకు బీరువాను అందించారు. పూర్వ విద్యార్థులు చందు, గణపతి, సాయి తదితరులు ప్రధానోపాధ్యాయులు ఎస్వీ మూర్తిరాజుకు బీరువాను అందించారు.

మహనీయుల ఆశయాలకు అనుగుణంగా సీఎం పాలన

పాలకొల్లు అర్బన్: బాబా సాహెబ్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతీరావ్ పూలే వంటి మహనీయుల ఆశయాలకు అనుగుణంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని జిల్లా పరిషత్ చైర్మన్, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ అభ్యర్థి కవురు శ్రీనివాస్ స్పష్టం చేశారు. పాలకొల్లు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దళిత, బడుగు, బలహీన వర్గాలకు రాజ్యాధికారం అందించాలనే ఆలోచనతో సీఎం జగన్ పాలన చేస్తున్నారన్నారు. 18 ఎమ్మెల్సీ పదవుల్లో 11 వెనుకబడిన వర్గాలకు, 2 షెడ్యూల్ కులాల వారికి, ఒక ఎమ్మెల్సీ షెడ్యూలు తెగలకు, 4 ఎమ్మెల్సీ స్థానాలకు అగ్రవర్ణాలకు కేటాయించి సామాజిక న్యాయం చేశారని శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీలుగా ఎంపిక చేసినవారిలో చాలా మంది పేద, మధ్య తరగతి కుటుంబాలవారేనన్నారు. పిల్లల బంగారు భవిష్యత్తు కోసం విద్యపై అత్యధిక మొత్తంలో నిధులు ఖర్చు చేశారన్నారు. పచ్చ మీడియా వీటిని పరిశీలించకుండా విషపు రాతలు రాస్తూ ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారని శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్ మాట్లాడుతూ దళిత, బలహీన, అగ్రవర్ణ పేదలు ఆర్థికంగా అభివృద్ధి చెందితేనే వారికి రాజ్యాంగ ఫలాలు అందినట్లుగా భావించాలని అంబేడ్కర్ కోరుకున్నారన్నారు. సమావేశంలో చింతలపూడి పార్టీ పరిశీలకుడు గుణ్ణం నాగబాబు, తూర్పుగోదావరి జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు బూరుగుపల్లి సుబ్బారావు, పార్టీ మండల కన్వీనర్ ఎం మైఖేల్‌రాజు, వీరా శ్రీనివాసరావు, సచివాలయాల కన్వీనర్లు ఎంఎస్ వాసు, పార్శి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్, ఎమ్మెల్సీ అభ్యర్థి కవురు శ్రీనివాస్